# మరో ప్రభుత్వం

కొమ్మూరి రవికిరణ్

కుర్చీలో కూర్చుని టేబుల్ మీద కాళ్ళు పెట్టి, విలాసంగా సిగరెట్ పొగ వదులుతున్నాడు హెల్త్ యిన్స్పెక్టర్ మురళీధరరెడ్డి.

అతని చూపులు పదే పదే ముందుద్వారం వంక చూస్తున్నాయి. అతని వాలకం చూస్తుంటే ఎవ్వరికోసమో ఎదురుచూస్తున్నట్టు వుంది. ప్రస్తుతం అతడు ఆలోచించేది రాష్ట్రంలో పిశాచంలా వ్యాపించిన మెదడు వాపు గురించి.


ఈ మెదడు వాపు పందుల నుంచి అంటు వ్యాధిలా మనుష్యులకు కూడా వస్తోందని, పంది మాంసం తినేవారికి ఎక్కువగా వచ్చే అవకాశాలు వున్నాయని వుద్ఘాటించిన రాష్ట్ర ఆరోగ్య శాఖామాత్యులు రాష్ట్రంలో వున్న పందులన్నింటిని చంపివేయమని మున్సిపాలిటీ వారికి ఆర్డర్స్ జారీ చేశారు.

అసలు పందులు ఎక్కువగా ఏ ప్రదేశాలలో సంచరిస్తున్నాయో, ఏ ఊరిలో, ఏ గ్రామంలో ఎక్కడ పంది మాంసం ఎక్కువగా ఉత్పత్తి జరుగుతుందో తెలుసుకు రమ్మని, రాష్ట్రంలో వున్న ప్రతి ఊరి హెల్త్ యిన్స్పెక్టర్‌కి పని అప్పగించబడింది.

గేటు తీసిన చప్పుడయ్యింది.

టేబుల్ మీద కాళ్ళు తీసేసి సరిగ్గా కూర్చున్నాడు మురళీధరరెడ్డి.

చంద్ర లోపలికి వచ్చాడు.



"రా చంద్రా! వెళ్ళిన పని ఏమయింది?" అడిగాడు రెడ్డి.

"ఈ ఊరి ప్రక్కనే వున్న రెండు మూడు గ్రామాల్లో నుంచి అన్ని విషయాలు సేకరించి వచ్చాను" అన్నాడు చంద్ర.

"పని ఏమయిందో చెప్పు ముందు."

"ఆ రెండు గ్రామాలలో దాదాపు అన్ని పందుల్ని చంపగలిగారు కాని..."

"కానీ?"

"ఒక్క వీరవనేనిగూడెంలోనే వందదాకా పందులు వున్నాయి"

"అదెలా సాధ్యం?" ఆశ్చర్యంగా అడిగాడు రెడ్డి.

'అక్కడ కరణం గారు..."

"ఇప్పుడు కరణాలు, మునసబులు లేరే?"

"అదే సార్! ఆ ఊరి మాజీ కరణంగారు పందుల్ని చంపనివ్వద్దని గ్రామ ప్రజలకు గట్టిగా చెప్పారు. ఆ గ్రామం మొత్తం ఆయనకి మద్దతు ఇచ్చింది."

"మరి మున్సిపాలిటీవాళ్ళు వాటిని చంపలేదూ?"

"వాటిని చంపనివ్వకుండా ఆ గ్రామంవాళ్ళు గట్టిగా కాపలా వున్నారు"

"ఆ గ్రామంలో మొత్తం ఎంతమంది జనం?"

"దాదాపు ఆరు వందల మంది దాకా వుంటార్సార్"

అని "ఒక్క నిమిషం సార్..."

"ఏమిటి?"

"అసలు ఆ గ్రామం నుండే ఎక్కువగా పంది మాంసం ఉత్పత్తి అవుతుందట సార్! మెదడు వాపు కూడా అందువల్లే ఎక్కువగా వుందని చుట్టుపక్కల గ్రామాలవాళ్ళు వాపోతున్నారు సార్!"

"మై గాడ్! వీరవనేనిగూడెంలోని ప్రజలు మూర్ఖుల్లా వున్నారే?"

"అవున్సార్!"

"సరే నువ్వెళ్ళు."

వెళ్ళబోయాడు చంద్రం.

"ఒక్క మాట" వెనుకనుంచి అన్నాడు రెడ్డి.

ఆగాడు చంద్రం.

"ఆ గ్రామంలోని పందుల్ని ఎక్కడ దాస్తున్నారు?"

"వీరవనేనిగూడెం మాజీ కరణంగారు రామస్వామి చౌదరిగారింట్లో."

ఆరోజే వీరవనేనిగూడెంకి బయలుదేరాడు హెల్త్ యిన్స్పెక్టర్ మురళీధరరెడ్డి.

** ** **

"కూర్చో" అన్నారు రామస్వామి చౌదరిగారు. ఆయనకి నలభై అయిదేళ్ళు వుంటాయి. చూడడానికి కొంచెం చదువుకున్న వారిలాగే వున్నారు.

"వచ్చిన పని ఏమిటి?" అడిగారు చౌదరిగారు.

చెప్పాడు రెడ్డి. చివరికి అన్నాడు "ఈ మెదడు వాపు బాధిస్తోందని ప్రక్క ప్రాంతాలవాళ్ళు గగ్గోలు పెడుతున్నారు"

"అసలు మెదడు వాపు ఎలా వస్తుంది?" మధ్యలో అడిగారు చౌదరిగారు.

"రోడ్డు మీద వున్న చెత్తా చెదారం, మురికిని పంది తింటుంది. ఆ పందిని కుట్టిన దోమ మనుష్యులను కూడా కుడితే మెదడు వాపు రావటానికి ఎక్కువ అవకాశాలు వున్నాయి."

కొత్త సంవత్సరానికి
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక అందించు కానుక



దాంపత్య దీపం, ఆరోగ్యదీపిక
శీర్షికలతో సుపరిచితులైన మీ అభిమాన
వైజ్ఞానిక రచయిత

డాక్టర్ జి.సమరం

1—1—88 సంచిక నుంచి ప్రాస్తున్న

"నిత్య జీవితంలో జెనిటెక్స్"

చదవండి! చదివి ఆలోచించండి!

"మెదడు వాపుని తగ్గించడానికి మందులే లేవా?"

"ఉన్నాయి కాని ముందు పందులని నిర్మూలిస్తే..."

అప్పటిదాకా శాంతంగా వున్న చౌదరిగారు లేచి గట్టిగా అరిచారు. "మేము చావడానికైనా సిద్ధపడతాం గాని, పందుల్ని చంపడానికి ఒప్పుకోం."

రెడ్డి కూడ లేచి నుంచున్నాడు. "మీరు అర్థం చేసుకోవట్లేదు."

మధ్యలోనే అతన్ని ఆపి - "అర్థం చేసుకున్నాం. మీరేం చెయ్యదలుచుకున్నారో చేసుకోండి. కాని ఒక్క పందిని కూడ చంపడానికి మేం యిష్టపడం" అన్నాడు గట్టిగా.

'నిజంగా మూర్ఖులే' అనిపించింది రెడ్డికి.

వెంటనే మున్సిపల్ కమిషనరుని కలుసుకున్నాడు మురళీధరరెడ్డి.

* * *

"అవును నేనూ విన్నాను పందుల్ని చంపమని మనుష్యులను పంపితే చంపనివ్వకుండా కట్టుదిట్టం చేశారట"

"అంత మూర్ఖంగా ఎందుకు ప్రవర్తిస్తున్నారో అర్థం కావటల్లేదు" అన్నాడు రెడ్డి.

"అది మూర్ఖం కాదు అహంకారం! చూస్తాను వాళ్ళ పొగరేమిటో?"

మర్నాడే

వంద మంది సిబ్బందిని లారీలో తీసుకుని స్వయంగా మరపేని గూడానికి బయలు దేరారు మునిసిపల్ కమిషనరుగారు.

* * *

దాదాపు ఆ వూరి జనం మొత్తం ఆ యింటి ముందు నిలబడ్డారు. ఆ యిల్లు మాజీ కరణం రామస్వామి చౌదరిగారిది.

అంతా గోల గోలగా మాట్లాడుకుంటున్నారు. వారిలో ఎక్కువ శాతం పురుషులే వున్నారు. జాగ్రత్తగా గమనిస్తే వాళ్ళ మొహాల్లో కసి కనబడుతుంది.

కాసేపటికి వున్నట్టుండి వాతావరణం నిశ్శబ్దం అయిపోయింది.

లోపల్నుంచి చౌదరిగారు వచ్చి కుర్చీలో కూర్చున్నారు.

అందరూ చౌదరిగారికి దణ్ణాలు పెట్టి అక్కడే ఇరుక్కుని కూర్చున్నారు.

చౌదరిగారు మాట్లాడారు "రోజులాగే యివాళ కూడా మునిసిపాలిటీ వాళ్ళు వస్తారు. ఎవరొచ్చినా సరే మన గ్రామంలో ఒక్క పందిని కూడా వాళ్ళు చంపకూడదు"

"ఒక వేళ పోలీసులు వస్తే" జనంలోంచి ఎవరో అరిచారు.

"పోలీసులే కాదు ఆ దేవుడే దిగి వచ్చినా సరే మనం ఒక పందిని కూడా పోగొట్టుకోకూడదు!"

"లాఠీ ఛార్జీ చేస్తారేమో" అన్నాడు ఇంకొకతను.

"అందుకే మనమందరం కలిసికట్టుగా వుంటే మనల్ని ఎవ్వరూ ఏం చెయ్యలేరు. చివరికి మన ప్రాణాలైనా పోగొట్టుకోడానికి యిష్టపడదాం కాని మనం ప్రాణంగా చూసుకునే పందుల్ని వాళ్ళు ఏమీ చెయ్యకూడదు తెల్సిందా?"

"మనం ప్రభుత్వం వుత్తర్వుల్ని ధిక్కరిస్తే వూరుకుంటారా?"

"ఊరుకోకపోతే వురేసుకోమను" అన్నారు నిర్లక్ష్యంగా చౌదరిగారు.

"అయితే మనం ఎన్నాళ్ళిలా చెయ్యాలి?"

"ప్రభుత్వం మన వూరికి తరలి వచ్చేదాకా!" గంభీరంగా సమాధానం యిచ్చారు చౌదరిగారు.

వాళ్ళు మాట్లాడుకుంటున్నారు. ఇంతలో అక్కడ ఒక జీపు, లారీ వచ్చి ఆగాయి.

జీపులోంచి మునిసిపల్ కమీషనరుగారు దిగారు.

జనం అంతా లేచి నుంచున్నారు. రామస్వామి చౌదరిగారు జీపు దగ్గరకు వచ్చారు.

"మీరేనా యిక్కడ పెద్ద" అడిగాడు కమీషనరు.

"అవును"

"ఏమిటి మా వాళ్ళు వస్తే పందుల్ని చంపనివ్వ లేదట. ఇది మంత్రిగారి ఆర్డర్స్ తెలుసా?"

## అవిశ్వాసం

విశ్వమంతా
విశ్వాసంమీద
కుక్క మొరిగిన
దవడ ఎముక విరిగిన
నిశ్వాసం మీద
షుగారీ చేతుల
కిరుక్కున్న బేడీల మీద
బాంగ్లా దేశీ అహసన్
వలలోంచి విదిల్చిన
చేప పిల్లమీద
నిలుస్తుంది

ఆనందం అనుకోని
అనృతంగా దూరమైపోయిన
చేపముక్క విదిమిన విన్న కన్నులా

మహోద్భుత సత్యాలేవో
న్యాయమూర్తుల ముందు
మహోన్మయ శక్తిలో
ముమ్మూర్తులా వినమ్రంగా
దిగ కార్చిన విమానంలా
తాలుతుంది

నైజీరియాలో
మధ్యాహ్నం రెండున్నరకి
ఎన్నెన్నో కోళ్ల అలారం గడియారాలు
ఉలిక్కి పడతాయి
నిద్రలోంచి వెక్కెక్కి
వెనకల వెనక్కి మెలికలు తిరుగుతాయి
నమ్మలేనట్లు

'మో'

"అయితే?" అడిగారు చౌదరిగారు.

"అంటే ప్రభుత్వాన్నే నిర్లక్ష్యం చేస్తున్నారన్న మాట"

ఇంతలో జనంలో నుంచి ఎవరో అరిచారు "మాకు వేరే ప్రభుత్వం లేదు! మేమే ప్రభుత్వం!"

"అయితే యిక్కడ పందుల్ని చంపనివ్వరా?" అడిగారు కమీషనరుగారు కోపంగా

"చస్తే చంపనివ్వం" అన్నారు చౌదరిగారు అంతకంటే కోపంగా.

"ఒరేయ్ రండిరా" అని అరిచారు కమీషనరుగారు.

లారీలో నుంచి వంద మంది దాకా దిగి పందుల్ని వుంచిన వైపు వెళ్ళబోయారు.

"ఆగండి అని గర్జించారు చౌదరిగారు.

ఆగి పోయారు అంతా.

"వాటి మీద ఏ మాత్రం ఎవరి చెయ్యి పడినా ఆ మనిషి గ్రామం దాటి బయటకు వెళ్ళరు" అన్నారు చౌదరిగారు.

"ఎంత ధైర్యం మీకు. నేనెవరో తెలుసా. మునిసిపల్ కమీషనరుని జాగ్రత్త!" అని అటు తిరిగి "మీరెళ్ళి మీ పని కానివ్వండి! ఎవరడ్డొస్తారో చూద్దాం" అన్నాడు కమీషనరుగారు.

ధైర్యం చేసి ముందుకు అడుగేశారు కమీషనరుగారి మనుష్యులు.

అంతే-

ఆవేశం కట్టలు తెంచుకుంది. వీరపనేని గూడెపు ప్రజలకు. చౌదరిగారి ఆజ్ఞ లేకుండానే వాళ్ళతో కలబడ్డారు.

రాష్ట్రంలో ఓ మూలనున్న ఆ చిన్న గ్రామంలో ఎవ్వరికీ కనీసం పేరు కూడా తెలియని ఆ గ్రామంలో మళ్ళీ మరో ప్రపంచ యుద్ధం జరిగిందా అనిపించేటట్టుగా తయారయ్యింది అక్కడి వాతావరణం.

ఆ సమరంలో మునిసిపల్ కమీషనరుగారికి కూడా దెబ్బలు తగిలాయి.

వీరపనేని గూడెం గ్రామ ప్రజల బలం ముందు మునిసిపాలిటీ మనుష్యులు నిలవలేక పోయారు.

వచ్చిన లారీ, జీపు తిరుగుముఖం పట్టాయి.

రాగానే వెంటనే ఆరోగ్య శాఖ మంత్రిగారికి ఫోన్ చేశాడు కమిషనర్ ఆవేశంగా.

"హల్లో" అటునుంచి మంత్రిగారి గొంతు. నమస్కారం పెట్టి విషయం, పరాభవం అంతా విన్నవించాడు మునిసిపల్ కమిషనర్. ఆయన చాలా కోపంగా వున్నాడు. మనిషి ఆవేశంతో వూగిపోతున్నాడు.

అంతా విన్నారు మంత్రిగారు. ఆయన చాలా శాంత స్వభావుడు, ఆలోచనాపరుడు. కాబట్టే ఆయనకి ఆ పదవి వచ్చింది.

"అసలు ఎందుకు అలా కట్టుదిట్టం చేసి మొండిగా ప్రవర్తిస్తున్నారో కారణాలు కనుక్కున్నారా?"

"నా ఉద్దేశ్యం-సరియైన కారణాలు లేవు సార్! ప్రభుత్వం రూల్స్‌ని మనం ఎందుకు పాటించాలి అన్న అహం" అన్నాడు కమిషనర్ ఈసడింపుగా.

## నిరీక్షణ

ఆశల పక్షులు
ఎగిరిపోయిన
చెట్టు
నా హృదయం!
ఏకాకైనా
వెన్నెలైనా
స్పందించని బండరాయి!
జ్ఞాపకాల ముక్కలు వెక్కిరిస్తున్న
అమావాస్య నాటి
ఆకాశం!
సఖీ!
ఏ వసంతాగమనపు
తొలి సంధ్యలోనో
ఆశల పుష్పాలు తొడుక్కుని
ఎదురు తెన్నులు చూస్తాననుకోకు నీకై-
నువ్వు వచ్చేవేళకి
ఈ మోడు బూడిదైపోతుంది
ఏ విరహాగ్నిలో!

-ఎస్. గుర్నాథ్

"నేను అడిగింది నీ ఉద్దేశ్యం కాదు. కారణాలు తెలుసుకున్నారా?"

"లేదు" అన్నాడు తడబాటుగా.

"ఎందుకని?"

"అంత ఛాన్స్ ఇవ్వలేదు! శాంతంగా మాట్లాడుతుంటుంటే నన్ను రెచ్చగొట్టారు, ప్రభుత్వాన్ని కూడా తిట్టారు".

"మరిప్పుడు మీరు ఏం చేద్దామనుకుంటున్నారు" అడిగారు మంత్రిగారు.

వెంటనే సమాధానం ఇవ్వలేదు కమిషనర్. ఒక్క నిమిషం ఆలోచించి చెప్పాడు "పోలీసుల సహాయంతో పని పూర్తి చేద్దామనుకుంటున్నాను సార్".

అటువైపు నుంచి మంత్రిగారు కూడా నిమిషం ఆలోచించి చెప్పారు. "వద్దు తొందరపడవద్దు. నేనే అక్కడకు వస్తున్నాను".

"మీరా! ఎక్కడికి వస్తారు?"

"వీరపనేనిగూడేనికి" అని జవాబు ఇచ్చారు మంత్రిగారు.

** ** **

మంత్రిగారు వచ్చారు అన్న వార్త గ్రామంలో గుప్పుమంది. దాదాపు గ్రామమంతా వచ్చిపడింది మంత్రిగారిని చూడడానికి.

ముందుగా మాజీ కరణం రామస్వామిచౌదరిగారు వచ్చి మంత్రిగారికి దండవేసి ఆహ్వానించాడు.

మంత్రిగారు చిరునవ్వుతో ప్రజలతోపాటు ముందుకు నడిచారు. అంతా చౌదరి గారింటి ముందు ఆగారు.

మంత్రిగారిని లోపలికి తీసుకువెళ్ళి అతిథి మర్యాదలు చేశారు చౌదరిగారు.

వారి మర్యాదలన్నీ చిరునవ్వుతో స్వీకరించారు మంత్రిగారు. తర్వాత విషయం కదిపారు. "చూడు, ఈ గ్రామమంతా ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నారో కారణం తెలుసుకోవచ్చా?"

"కారణం చెప్పేముందు ఒక విషయం చెపుతాను. ఇంతవరకు మాకు కొన్ని కారణాలు వున్నాయని గ్రహించి, శాంతంగా అడిగిన మొట్టమొదటి మంత్రిగారు మీరే. అందుకు ఈ గూడెం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాను" అన్నారు చౌదరిగారు.

ఆశ్చర్యంగా చూశారు మంత్రిగారు. అది గ్రహించిన చౌదరిగారు చెప్పుకుపోయారు.

'ఔనండి ఇది నిజం! ఈ చుట్టుప్రక్కల గ్రామాలన్నింటికన్నా చాలా వెనుకబడి, మరుగునబడిన గ్రామం మాది. కాలం మారిపోతోంది, పుష్కరాలు అయిపోతున్నాయి, ఎలక్షన్‌లు వస్తున్నాయి, పోతున్నాయి, ప్రభుత్వం కూడా మారిపోయి కొత్త ప్రభుత్వం వచ్చింది. అయినా మా గ్రామం గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఒక్క మెదడు వాపు ఏమిటి ఖర్మ- కొన్నాళ్ళు కలరా వచ్చింది, కొన్నాళ్ళ టైఫాయిడ్ వచ్చి పొయ్యేవాళ్ళు పోయారు. దానిని నివారించేందుకు వైద్య సదుపాయం లేదు. గట్టివాళ్ళు మిగిలారు.

"మీరు ప్రభుత్వానికి మీ సమస్యలను విన్నవించాలి. అలా చేస్తే మీ సమస్యలు ఎందుకు పరిష్కారం కావు?" అడిగారు మంత్రిగారు.

"కావు. మా సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావు. ఇప్పుడేంటి, నా చిన్నతనం నుంచి ప్రభుత్వానికి ఎన్నో పత్రాలలో మా సమస్యలు విన్నవించుకున్నాము. అయినా మా బాధల్ని వినిపించుకున్ననాథుడే లేడు.

ఇదంతా ఎందుకు, మా గ్రామంలో వున్న మురికిని, చెత్తా చెదారాన్ని తీసివెయ్యడానికి ఇంతవరకు ఏ మునిసిపాలిటీవాళ్ళు రాలేదు. ఎన్నోసార్లు మునిసిపాలిటీవాళ్ళకి లిఖితపూర్వకంగా చెప్పాను. అయినా మా సమస్యలు సమస్యలుగానే వుండిపోయాయి. ఈ మురికిని, కుళ్ళుని, వాటివల్ల వచ్చే రోగాలకు భరించలేక, తాళలేక ఎందరో మరణించారు. అందుకే మాకు ఎలాంటి జబ్బు వచ్చినా సరే, చావనైనా చస్తాం కాని పందుల్ని చంపడానికి మాత్రం ఇష్టపడలేం. మా బతుకులు మేము బతకడానికి నిర్ణయించాం.

"కాని మీ సమస్యలకి, పందుల్ని చంపడానికి ఒప్పుకోకపోవడానికి ఏమిటి సంబంధం?" అన్నారు మంత్రిగారు.

మొట్టమొదటిసారిగా నవ్వారు చౌదరిగారు. "ఇన్నాళ్ళు మా గ్రామంలో వున్న మురికిని, చెత్తని ఎవ్వరూ శుభ్రం చెయ్యకపోయినా మేము ఎలా వుంటున్నామనుకున్నారు. పందులు వుండడంవలనే మా వూరు ఈ మాత్రం శుభ్రంగా వుంది".

అసలు విషయం అర్థమై. నోటిమాట రానట్టు వుండిపోయారు ఆరోగ్య శాఖ మంత్రిగారు.